క్లుప్తంగా

అర్హులకు సామాజిక పింఛన్లు అందజేయండి

కార్పొరేటర్ సత్యబాబు



వించిపేట(విజయవాడపశ్చిమ): పెండింగ్‌లో ఉన్న సామాజిక పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని, అర్హులకు కొత్తగా మంజూరు చేయాలని 50వ డివిజన్ సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని కోరారు. శుక్ర వారం డివిజన్‌లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో పూర్తి స్థాయిలో పెన్షన్ల పంపిణీ జరగలేదన్నారు. అధికారులు సర్వర్‌లో లోపాలను సరిచేసి పెన్షన్ సక్రమంగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అర్హత ఉండి పెన్షన్లు రాని ఎంతో మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు.

నేటి నుంచి పాతశివాలయంలో కార్తిక మాసోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో ఈ నెల రెండు నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకూ కార్తిక మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మ మధు, ఈవో నటరాజన్‌షణ్ముగం చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్తికంలో నెల రోజులు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు సోమవారాలు, పౌర్ణమి రోజులతో పాటు నిత్యం దేవస్థానానికి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి 30 రోజుల పాటు 30 అలంకారాలు చేస్తారని చెప్పారు. ప్రధాన అర్చకుడు రాచకొండ సుమంత్ శర్మ, అర్చకులు రాచకొండ నాగరాజు శర్మ, నంబూద్రి మురళీధరన్ గురుస్వామి తదితరులు మాట్లాడారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు రాంపిళ్ల వాసు, నాగోతి విజయనిర్మల పాల్గొన్నారు.

11 నుంచి బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, మిషన్ ఎంబ్రాయిడరీల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు. కొత్త బ్యాచ్‌కు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు మూడు నెలల పాటు జరిగే శిక్షణకు ఆసక్తిగలవారు ఈ నెల 10వ తేదీ లోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మహిళా కార్మికులు రుతుస్రావ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వర్షా పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పారిశుద్ధ్య, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళా సిబ్బందికి శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు, శానిటరీ, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షధారులకు అన్నప్రసాద వితరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీహరిహర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అయ్యప్ప దీక్షాధారులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని సేవాసమితి అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. కొత్తపేట వీరాంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలో అయ్యప్ప దీక్షాధారులకు అన్నప్రసాద వితరణను శుక్రవారం పూజలు చేసి ప్రారంభించారు. తొలుత అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా కార్తిక మాసం ప్రారంభం రోజు నుంచి 41 రోజుల పాటు అయ్యప్ప దీక్షాపరులకు అన్న ప్రసాద వితరణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం కోసం మందుబాబులు ఉదయం 10 గంటల వరకు ఆగక్కర్లేదు. కోడి కూతకు ముందే మద్యాన్ని పక్కదారిన విక్రయించేస్తున్నారు. దీంతో తెల్లవారుజామునుంచే మందుబాబులు తూగుతూ కనిపిస్తున్నారు. 'పశ్చిమ' పరిధిలో బార్‌ల నిర్వాహకులు సమయపాలన పాటించకపోయినా, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కోడికూతకు ముందే..



దుకాణాల అరుగులపైనే మద్యం సేవిస్తున్న మందు బాబులు

- 'పశ్చిమ'లో తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు
- బార్‌ల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- సమయంపాలన ఏదీ
- పట్టించుకోని అధికారులు

వించిపేట(విజయవాడపశ్చిమ): 'పశ్చిమ' అంటే మందుబాబులకు పండగే. ఎందుకంటే ఇక్కడ తెల్లవారుజాము, అర్ధరాత్రి అనే తేడా లేదు ఎప్పుడైనా మందు దొరుకుతుంది. ఈ ప్రాంతంలో బార్ల నిర్వాహకులు పక్కదారి నుంచి మద్యం అమ్మేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బార్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్, పోలీసు సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఏ సమయంలో వెళ్లినా మద్యం విక్రయిస్తూ 'ఎనీ టైమ్ మద్యం'గా మార్చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్‌లలో విక్రయించాలనే నిబంధనలు ఉన్నాయి. వాటి నిర్వాహకులు తెల్లవారుజామున 5 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు విక్రయాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా కొత్తపేటలోని చిట్టినగర్, సొరంగం రోడ్డు, కుండల మార్కెట్, రావిచెట్టు సెంటర్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బారుల్లో తెల్లవారుజాము 5 గంటలకే దుకాణం వెనుక ద్వారాలు తెరచి మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. మద్యం సేవించిన మందుబాబులు హడావుడి చేయడం, ఇదేమని అడిగిన మహిళలతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని పలువురు వాపోతున్నారు.

ఆదాయమే లక్ష్యం..

ఆదాయమే లక్ష్యంగా బార్‌ల నిర్వాహకులు ఎక్కువ మొత్తంలో విక్రయాలు సాగించేందుకు నిబంధనలను పక్కన పెడుతున్నారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వర్తించడంతో వైన్ షాపులు సమయపాలన పాటిస్తూ నడిపేవారు. ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో పాటు విక్రయాల సమయం కూడా రాత్రి 10 గంటల వరకు పెంచడంతో మందుబాబులు వైన్ షాపుల్లోనే కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో బారుల్లో విక్రయాలు తగ్గిపోవడంతో తమ ఆదాయం పెంచుకునేందుకు వారు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. దీంతో గతంలో కంటే క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ. 40 వరకు తగ్గించి వెనుక మార్గాల ద్వారా ఏ సమయంలో వెళ్లినా మద్యం విక్రయిస్తు ఆదాయం పెంచుకుంటున్నారు.

రోడ్లపైనే మద్యం సేవిస్తూ..

రోడ్లు, పార్కింగ్ చేసిన ఆటోల్లో మందుబాబులు మద్యం సేవిస్తు నానా యాగి చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రాత్రిళ్లు 11 గంటల తర్వాత మద్యం కొనుగోలు చేసి ఇళ్ల అరుగులు, పార్కింగ్ చేసిన వాహనాల్లో మద్యం సేవిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లాలంటే మహిళలు భయపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

తెల్లవారుజాము నుంచే బార్‌లలో విక్రయాలు సాగిస్తుండటంతో పనులకు వెళ్లే తమ భర్తలు మద్యం సేవించి.. పనులకు వెళ్లడం లేదంటూ పలువురు మహిళలు వాపోతున్నారు. తెల్లవారుజామునే విక్రయాలు సాగిస్తున్నా పోలీసులు కనీస చర్యలు కూడా తీసుకోకపోవడంపై వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమయపాలన పాటించని బార్‌లపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



చిట్టినగర్‌లో బార్‌లోకి శుక్రవారం ఉదయం 7 గంటలకు పక్క ద్వారం నుంచి వెళ్తున్న మందుబాబులు



రావిచెట్టుసెంటర్‌లోని బార్‌లో ఉదయం 7గంటలకే తెరుచుకున్న పక్క ద్వారం

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడండి

డీఎంహెచ్ఓ సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంటి ఆవరణతో పాటు, పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలని పలు ప్రాంతాల ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అవగాహన కలిగించారు. జిల్లాలో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న లార్వా సర్వేను తనిఖీ చేశారు.

రేపు టెర్రస్ గార్డెన్స్‌పై అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మిద్దె తోటలు (టెర్రస్ గార్డెన్స్) పెంపకంలో మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడానికి ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మిద్దె తోటల పెంపకం మొదలు పెట్టేటప్పుడు పరిశీలించాల్సిన అంశాలు, ప్రస్తుత సీజన్‌కు అనువైన విత్తనాలు, మొక్కలు ఎంచుకోవడంలో కుండీల ఎంపిక మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వీఎంసీ చేపట్టిన పనుల్లో పురోగతి మరింత పెరగాలని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన చాంబర్‌లో శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో కార్పొరేషన్ చేపట్టిన పనులు ఎంత వరకయ్యాయి, ఎన్ని ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి, నగరంలో ఇంకా పెంపొందించాల్సిన మౌలిక వసతులపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. నగరంలో ఇంజినీరింగ్ విభాగం చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని, పనులను ఇంజినీర్లు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గత కౌన్సిల్‌లో తీర్మానాలపై అధికారులు తీసుకున్న చర్యలు, వాటి పురోగతి అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం, నగరాభివృద్ధికి కౌన్సిల్ తీర్మానించిన ప్రతిపాదనలపై అశ్రద్ధ చేయొద్దని ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సుపరింటెండింగ్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, అసిస్టెంట్ కమిషనర్లు రెవెన్యూ, పాల్గొన్నారు.

సాయి మందిరంలో చండీహోమం



భవానీపురం(విజయవాడపశ్చిమ): బహుళ అమావాస్య సందర్భంగా భవానీపురం పాత హౌసింగ్‌బోర్డ్‌లోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం చండీహోమం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు గూడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా అమావాస్య రోజున బాబా మందిరంలో భక్తులతో కలిసి నిర్వహిస్తున్న చండీహోమం శుక్రవారంతో '100' కావడం విశేషం. రుత్వికులు ఉమాకాంత శర్మ నేతృత్వంలో ఆయన శిష్య బృందం హోమం చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేవారు. గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిబాబా మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నగరానికి చెందిన శ్రీనర్తన కూచిపూడి ఆర్ట్స్ అకాడమికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై డి.కె. దేవి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ బీసీ నేత మృతి



పాశం శివ(ఫైల్)

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నగర ప్రధాన కార్యదర్శి పాశం శివ(45) గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున మరణించారు. ఆయన విద్యాధరపురంలో నివసించేవారు. శివ మరణ వార్త తెలిసిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, పీఏసీ సభ్యుడు షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, వినోద్‌పాల్, భాస్కర్, పలువురు నేతలు నివాళులర్పించారు.

పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరువలేం



అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు



నివాళులర్పిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాణత్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినేని అవినాష్ అన్నారు. నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని రాష్ట్రం అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తున్నామన్నారు. కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, తంగిరాల రామిరెడ్డి, వియ్యపు అమర్నాథ్, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు త్యాగాన్ని అవమానించిన చంద్రబాబు: వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను బలి చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములను ఆయన త్యాగాన్ని దారుణంగా అవమానించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు విమర్శించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మునిసిపల్ కార్యాలయం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వేడుకలను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ, కొణిజేటి రోశయ్య విగ్రహాలకు.. వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ విభజిత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పని చేశారని తన ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపలేదన్నారు. నాడు జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న సమయంలో అనేక మంది ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపాలని కోరారని గుర్తుచేశారు. ఆయన ముఖ్యమంత్రి అయిన మొదటి సంవత్సరంలోనే నవంబర్ 1వ తేదీన అధికారికంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరపాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ, ఆర్యవైశ్య నాయకుడు కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు కొనసాగించాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు కేవలం ఒక వ్యక్తి కాదని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమర యోధుడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటువంటి మహనీయుడి సేవలకు గుర్తుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్‌లో ఆయన పేరుమీద ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని తెలంగాణా ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. సురవరం అంటే అందరికీ అభిమానమేనని, ఆయన పేరును మరో సంస్థకు పెట్టుకుని తమ అభిమానాన్ని చాటుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమర యోధుడి పేరు మార్పుపై పునరాలోచించాలని కోరారు. లేని పక్షంలో ఆంధ్రా తెలంగాణ సరిహద్దుల్లో ఉద్యమం చేపట్టేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

'పశ్చిమ'లో సందడే సందడి



కెనాల్‌రోడ్డులో బాణసంచా విక్రయాలతో కిక్కిరిసి ఉన్న ప్రజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దీపావళి పర్వదినం పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారులు గురువారం సందడిగా దర్శనమిచ్చాయి. బాణసంచా మోతతో వన్‌టౌన్ దద్దరిల్లింది. వన్‌టౌన్‌లోని మెయిన్‌బజార్, సామారంగంచౌక్, ఐరన్ మార్కెట్, శివాలయంవీధి, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్లలో మట్టి ప్రమిదలను విక్రయించారు. మిఠాయి దుకాణాలు రద్దీగా కనిపించాయి. దీపావళి పురస్కరించుకుని ఉత్తర భారతీయులు లక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహించారు. గత అనుభవాల దృష్ట్యా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న ఖాళీ ప్రాంతంలోకి కొంతమంది చిరువ్యాపారులను అనుమతించారు. సుమారు నాలుగైదు వందల మంది హాకర్లు అమ్మకాలు సాగించగా వేలాదిగా వినియోగదారులు తరలివచ్చి సరుకులను కొనుగోలు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో దీపావళి వేడుకలు

- మూలవిరాట్ వద్ద ధనలక్ష్మీ పూజ
- ఆది దంపతుల ఆలయాల వద్ద దీపార్చన



దుర్గగుడి ప్రాంగణంలో బాణసంచా వెలుగులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం అమ్మవారి మూలవిరాట్ వద్ద ఆలయ వైదిక కమిటీ ధనలక్ష్మీ పూజను నిర్వహించగా, ఈవో కె.ఎస్.రామరావు దంపతులు పూజలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాకారం చుట్టూ దీపాలంకరణ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన నేతి దీపాలను ఆలయ ఈవో రామరావు దంపతులు, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది వెలిగించారు. అంతకు ముందు అమ్మవారికి పంచ హారతుల సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద ఆలయ అధికారులు బాణసంచా వెలిగించి వేడుకలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ ద్వారాలను కవాట బంధనం చేశారు.

అమావాస్య, శుక్రవారం నేపథ్యంలో అమ్మవారికి గురువారం, శుక్రవారం నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆర్జిత సేవల ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా దర్శనానికి అనుమతించారు.

ఆది దంపతుల సన్నిధిలో ఆకాశదీపం

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధితో పాటు మల్లేశ్వరాలయం, నటరాజ స్వామి వారి ఆలయం వద్ద ఆకాశదీపాన్ని వెలిగించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆకాశ దీపాన్ని ఈవో కె.ఎస్.రామరావు పూజా కార్యక్రమాలను నిర్వహించి దీపాన్ని వెలిగించారు. కార్తిక మాసం సందర్భంగా నెల రోజుల పాటు మూడు ఆలయాల్లో ఆకాశదీపం వెలిగించి కార్తిక దామోదరుడికి సమర్పిస్తామని, భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఈవో రామరావు కోరారు.

'పది' పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలి

జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి సుబ్బారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు అన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ స్కూల్లో ఉపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమం ముగిసింది. నగరంలోని సెంట్రల్, నార్త్, ఈస్ట్, వెస్ట్ మండలాలకు చెందిన 605 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులనుద్దేశించి డీఈఓ యు.వి సుబ్బారావు మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత పెంచడానికి ఓరియంటేషన్ కార్యక్రమం దోహదం చేస్తుందని చెప్పారు. సిలబస్, బ్లూ ప్రింట్, మాదిరి ప్రశ్నాపత్రం గురించి వివరించారు. ఎఫ్ఏ-1 మార్కులను ఆన్‌లైన్ చేసి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 14న వ తేదీ జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో అందజేయాలన్నారు.

సమావేశం రోజున తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈసీబీ కార్యదర్శి షేక్ ఉమర్ ఆలీ, కోర్సు డైరెక్టర్ బాణోతు వెంకటేశ్వర్లు, సీవీఆర్ హై స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటి రాజు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ఆల్ సోల్స్ డేకు సమాధుల శుభ్రం



సమాధులపైకి వచ్చిన పిచ్చి మొక్కలను కట్ చేస్తున్న వీఎంసీ సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాతాపితరులు, బంధువులు, స్నేహితుల ఆత్మల శాంతి కోసం ఏటా ఒక రోజున వారి సమాధులకు పూజలు చేసి స్మరించుకోవడం కొన్ని దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఆ దినాన్నే 'ఆల్ సోల్స్ డే'(సమస్త ఆత్మల దినం) అని పిలుస్తారు. దాన్నే సమాధుల పండుగ అనికూడా వ్యవహరిస్తారు. ఏటా నవంబర్ 2న వచ్చే పండుగ నేపథ్యంలో భవానీపురంలోని పురాతన క్రైస్తవ శ్మశానవాటిక ముస్తాబవుతోంది. 15 రోజుల నుంచి నగరపాలక సంస్థ పార్కుల విభాగం సిబ్బంది శ్మశానవాటికలోని చెట్లు కొట్టి శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సమాధుల చుట్టూ కొమ్మలను తొలగిస్తున్నారు. సమాధులకు కొందరు రంగులు వేయించడం, గ్రానైట్ రాళ్లతో ముస్తాబు చేసుకున్నారు.

వక్ఫ్ బిల్లు తిరస్కరణకు సీఎం సహకరించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వక్ఫ్ సవరణ బిల్లు 2024ను పార్లమెంటులో తిరస్కరించడానికి ఏపీ ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ముస్లిమ్స్ పర్సనల్ లా బోర్డు రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా మహమ్మద్ ఫజ్లులూర్ రహీం శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు గత నెల 23న సీఎం చంద్రబాబును మైనార్టీ మంత్రి ఎండీ ఫరూక్ సమక్షంలో కలిసి వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన, అప్రజాస్వామికమైన ముస్లిం వ్యతిరేక బిల్లు తిరస్కరణను దయతో సమర్థిస్తారని, దాన్ని పార్లమెంటు ఆమోదించకుండా చూడాలని కోరామని పేర్కొన్నారు. వెనుకబడిన ముస్లింలకు నాలుగు శాతం కోటాను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

6న కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈనెల 6వ తేదీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లోకేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ దుస్తులతో హుండీ కానుకల లెక్కింపులో పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.